ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.0
కనిష్ఠం 21.4
***

ANDHRAJYOTHY

నల్లగొండ

5

గురువారం 8 ఆగస్టు 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	583.80 (296.5695)	3,74,658	2,70,900
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.50 (3.57)	334.54	277.56
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	168.86 (36.78)	2,50,518	2,78,573

చికెన్ ధరలు | లైవ్ : రూ.103 | డ్రెస్ : రూ.150 | స్కిన్‌లెస్ : రూ.170

డిండి ఎత్తిపోతల ముందుకు సాగేనా?

▸▸ పథకాన్ని పూర్తిచేయాలని రేపు సీపీఎం ఆధ్వర్యంలో సదస్సు



నల్లగొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లోని ఫ్లోరైడ్‌పీడిత గ్రామాలకు తాగు, సాగునీరందించే లక్ష్యంతో 2105లో చేపట్టిన ఆర్.విద్యాసాగర్‌రావు డిండి ఎత్తిపోతల పథకం పనుల కొనసాగింపుపై ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఈ పథకం పనులపై సమీక్షలు నిర్వహించిన మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నేనావత్‌బాలూనాయక్, ఈ పథకానికి ఆటంకాలు తొలగించేందుకు అవసరమైన కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. అదే సమయంలో బడ్జెట్ ప్రసంగం ద్వారా ఈ పథకాన్ని మూడేళ్లలో పూర్తిచేసే ప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాలో చేరుస్తున్నట్టు ప్రకటించడంతోపాటు బడ్జెట్‌లో రూ.300కోట్ల నిధులు కేటాయించడం ద్వారా ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోన్న విషయాన్ని తెలియజెప్పారు. ఈ ప్రాజెక్టులో కీలకమైన నీటిని సేకరించే పనులు (హెడ్‌వర్క్స్)పై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

నీటిని సేకరించేది తేలితేనే పనులు ముందుకు

డిండి ఎత్తిపోతల పథకంలో కీలకమైన నీటి సేకరణ ఎక్కడనే అంశంపై సందిగ్ధం కొనసాగుతోంది. ఈ ప్రాజెక్టుకు శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి రోజుకు అరటీఎంసీ చొప్పున, వరద రోజుల్లో 60 రోజుల్లో 30టీఎంసీల నీటిని సేకరించాలని నిర్ణయించారు. ఉల్పర వద్ద దుందుభినది (డిండినది)పై బ్యారేజీ నిర్మించి అక్కడి నుంచి కాల్వ ద్వారా నేరుగా శివన్నగూడెం వరకు 66.300కిలోమీటర్ల ప్రధాన కాల్వ నిర్మించాలని డిజైన్‌లో పొందుపరిచారు. అయితే ఉల్పర వరకు శ్రీశైలం నీటిని ఎలా తరలించాలనే అంశంపై ప్రభుత్వం, ఇరిగేషన్‌శాఖ స్పష్టతకు రాలేకపోతోంది. గత ప్రభుత్వం ఆలోచన ప్రకారం శ్రీశైలం రిజర్వాయర్ నుంచి డిండి ఎత్తిపోతలకు నేరుగా కాకుండా, పాలమూరు-రంగారెడ్డి పథకంతో కలిపి తీసుకోవాలని నిర్ణయించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 60 రోజుల్లో 90టీఎంసీలు, డిండికి అదే 60 రోజుల్లో 30టీఎంసీలు కలిపి మొత్తం 60రోజుల్లో రోజుకు 2టీఎంసీల చొప్పున 120టీఎంసీల నీటిని సేకరించేలా పాలమూరు ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ వద్ద పంపులు, మోటర్లు డిజైన్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఏదుల రిజర్వాయర్ లేదంటే వట్టెం రిజర్వాయర్ల నుంచి ఉల్పరలో ప్రతిపాదిస్తున్న బ్యారేజీ వరకు కృష్ణాజలాలను తరలించాలని సూచనప్రాయంగా నిర్ణయించారు. ఇది ప్రతిపాదనకే పరిమితమవడం, పాలమూరు ప్రాజెక్టు నీటిని డిండికి ఎట్టిపరిస్థితుల్లో తరలించవద్దనే పాలమూరు ప్రజాసంఘాలు, రాజకీయనేతల ఒత్తిళ్ల నేపథ్యంలో గత ప్రభుత్వం ఆ పనులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా డిండి ఎత్తిపోతల పథకంలో దిగువన ఉన్న రిజర్వాయర్లు, కాల్వల పనులు కొనసాగించింది. కొత్త ప్రభుత్వమైనా ఈ కీలకమైన పనులను ఎక్కడ చేపడతారో తేల్చి వాటిని కూడా పెండింగ్ పనులతో సమాంతరంగా నిర్వహిస్తేనే ప్రాజెక్టు పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి.

రిజర్వాయర్ల పనులకు భూసేకరణ, పునరావాస కల్పనే అడ్డంకి


డిండి ఎత్తిపోతల పథకం పరిధిలో 66.300కిలోమీటర్ల ప్రధాన కాల్వతో పాటు, సింగరాజుపల్లి, గొట్టిముక్కల, చింతపల్లి ఆఫ్‌లైన్ రిజర్వాయర్ల నిర్మాణాలతో పాటు ప్రస్తుతం ఉన్న డిండి రిజర్వాయర్ ఎత్తుపెంపు పనులు, ఉల్పర బ్యారేజీ సహా ఎర్రవల్లి-గోకారం, కిష్టరాంపల్లి, శివన్నగూడెం ఆన్‌లైన్‌రిజర్వాయర్ల పనులు చేపట్టారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఆమనగల్లు మండలంలో ప్రతిపాదించిన మరో ఆన్‌లైన్ రిజర్వాయర్ ఇర్విన్‌ను ప్రజలు వ్యతిరేకించడంతో ఆ పనులు నిలిపివేశారు. ప్రధాన కాల్వతో పాటు, అన్ని రిజర్వాయర్లకు కలిపి ఇర్విన్‌ను మినహాయిస్తే 15,031.06 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 8841.01 ఎకరాల భూమిని సేకరించారు. ఇంకా 6,188.95 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఈ భూమితో పాటు నాగర్‌కర్నూల్ జిల్లాలోని గోకారం-ఎర్రవల్లి రిజర్వాయర్ కింద నిర్వాసితులయ్యే ఎర్రవల్లి, ఎర్రవల్లి తండాలకు చెందిన గ్రామస్థులకు, నల్లగొండ జిల్లాలో కిష్టరాయన్‌పల్లి నిర్వాసితులయ్యే నాంపల్లి మండలం లక్ష్మణపురం, చింతపల్లి మండలం ఈదులగూడెం గ్రామస్థులకు, శివన్నగూడెం రిజర్వాయర్‌తో నిర్వాసితులయ్యే చర్లగూడెం, నర్సిరెడ్డిగూడెం, వెంకెపల్లి, వెంకెపల్లి తండాల నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సి ఉంది. వీరికి పునరావాసం కల్పిస్తేనే దాదాపు సగం మేర నిలిచిన రిజర్వాయర్ల పనులు ముందుకుసాగుతాయి.

డీపీఆర్ ఆమోదం, నిధుల కేటాయింపు డిమాండ్‌తో సీపీఎం సదస్సు

ఉమ్మడి జిల్లాలోని కరువుపీడిత, ఫ్లోరైడ్‌పీడిత ప్రాంతాలకు సాగు, తాగునీరందించేందుకు ఉద్దేశించిన డిండి ఎత్తిపోతల పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేసేందుకు ముందుకుసాగాలని సీపీఎం డిమాండ్ చేస్తోంది. ఈ అంశాలపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డితో పాటు, భారీనీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేసింది. తాజాగా, ఈ పథకానికి డీపీఆర్‌ని (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) ఆమోదించడంతో పాటు అవసరమైన నిధులను కేటాయించి పథకం పనులు పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం కోరుతోంది. ఇదే డిమాండ్‌తో సీపీఎం ఈనెల 9న నల్లగొండలో సదస్సు నిర్వహిస్తున్నట్టు పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు.

రైల్వే డబ్లింగ్‌కు భూ సర్వే





రైల్వే డబ్లింగ్ పనులకు రైల్వేశాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. రెండో లైన్ ఏర్పాటుకు కావల్సిన భూసేకరణ పనులు చేపట్టింది. బీబీనగర్-నడికుడి మార్గంలో గత ఏడాది ఆగస్టులో రెండోలైన్‌కు ఆమోదం తెలిపిన కేంద్ర క్యాబినెట్ గత నెల జూన్ నుంచి భూసేకరణ పనులు చేపట్టింది. సుమారు 48కి.మీ భూసేకరణ పనులు పూర్తి చేసిన అధికారులు సర్వే కోసం రెవెన్యూశాఖ ప్రతిపాదనలు పంపినట్టు సమాచారం.

- మిర్యాలగూడ

▸▸ బీబీనగర్-నడికుడి మార్గంలో రెండో లైన్

▸▸ 48కి.మీ మేర 98శాతం భూసేకరణ పూర్తి

డోర్నకల్-మిర్యాలగూడ రైల్వేలైన్‌కు ఎఫ్ఎల్ఎస్‌ను రైల్వేశాఖ గత సెప్టెంబరులో మంజూరు చేసింది. డబ్లింగ్‌తో పాటు నూతన రైల్వేలైన్ పూర్తయితే నడికుడి, బీబీనగర్‌లా మిర్యాలగూడ రైల్వే జంక్షన్‌గా రూపాంతరం చెందనుంది. ఉత్తర, దక్షిణ భారతదేశం మధ్య ప్రయాణదూరం తగ్గించేలా రైల్వే మంత్రిత్వ శాఖ రైళ్ల అనుసంధానాన్ని బలోపేతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో తెలంగాణలో డోర్నకల్-మిర్యాలగూడ రైల్వే లైన్ ఏర్పాటుకు గత ఏడాది 120 కి.మీ ఫైనల్ లొకేషన్ సర్వే(ఎఫ్ఎల్ఎస్) మంజూరు చేసింది. దీంతో ఆయా ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యం మరింత మెరుగుపడటమేగాక రెండు లైన్లతో ఈ ప్రాంతాల మధ్య రైళ్ల రాకపోకలకు అంతరాయం లేకుండా వేగంగా గమ్యాన్ని చేరే అవకాశం ఉందని రైల్వే ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

యాదాద్రి పవర్ ప్లాంట్‌కు బొగ్గు రవాణా సులభం

జిల్లాలో రూ.2,160 కోట్ల అంచనా వ్యయంతో 120కి.మీ మేర చేపట్టనున్న డోర్నకల్-మిర్యాలగూడ నూతన రైల్వే లైన్ నిర్మాణంతో దక్షిణ తెలంగాణకు ప్రయోజనం చేకూరనుంది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాలను కలుపుతూ ఏర్పాటుచేయనున్న కొత్త రైల్వే మార్గంతో ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. వ్యవసాయం, వ్యాపారం, విద్య, పర్యాటకం లాంటి పలు రంగాల్లో సామాన్య ప్రజల ప్రయాణ అవసరాలు తీరనున్నా యి. వచ్చే డిసెంబరు నాటికి రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించే లక్ష్యంతో నిర్మాణ పనులు కొనసాగిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌కు అవసరమైన ముడిసరుకు బొగ్గు రవాణాను ఈ నూతన రైల్వే మార్గం సులభతరం చేయనుంది. డోర్నకల్-మిర్యాలగూడ రైల్వేలైన్ సింగరేణి కాలరీస్ నుంచి రానున్న బొగ్గును వైటీపీకి చేర్చేందుకు అనువుగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో పాటు హుజూర్‌గర్, కోదాడ ప్రాంతాల పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లుల నుంచి బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు రవాణాకు అనువుగా ఉంటుందని, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాలో వేగవంతమైన మార్పులు చోటుచేసుకుంటాయని పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాకు అదనపు ప్రయోజనం

డబ్లింగ్‌తో రైళ్ల సంఖ్యను పెంచేందుకు వీలుకలగడమేగాక ఒకే లైన్‌తో రైళ్ల రాకపోకల్లో ఎదురయ్యే అవాంతరాలను అధిగమించవచ్చునని అధికారులు భావిస్తున్నారు. డబ్లింగ్‌తో సెక్షన్ సామర్థ్యం పెరిగి ఎక్కువ రైళ్లు నడవనున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో వలిగొండ, రామన్నపేట, చిట్యాల, నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడతో పాటు ఏపీ రాష్ట్రంలోని దాచెపల్లి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు వరకు ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్నారు. రైల్వే స్టేషన్లలో పటిష్ఠ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటుతో పాటు నూతన ప్లాట్‌ఫాంలు, ఆధునిక విశ్రాంతి గదులు, రైళ్ల రాకపోకల సమయాన్ని సూచించే డిజిటల్ బోర్డులు సహా పలు వసతులు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి.



కుక్కడం-నడికుడి మధ్య భూసేకరణ పూర్తి

బీబీనగర్-నడికుడి 248కి.మీ రెండోలైన్ ఏర్పాటుకు రైల్వేశాఖ కసరత్తు ప్రారంభించింది. రూ.2,853.23కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా భూసేకరణ పనులు కొనసాగుతున్నట్టు సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కుక్కడం నుంచి గుంటూరు జిల్లా నడికుడి వరకు 48కి.మీ మేర భూసేకరణ పనులు 98 శాతం పూర్తి చేసినట్టు తెలుస్తోంది. రైల్వే ట్రాక్ నిర్మాణ పనుల సమయంలో వెహికల్ పార్కింగ్, రవాణా కోసం భూసర్వే చేపట్టాల్సిందిగా జిల్లా రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు పంపినట్టు సమాచారం. రెండో లైన్ ఏర్పాటులో వాడపల్లి వద్ద కృష్ణానదిపై రైల్వే వంతెన నిర్మాణంతో పాటు సుమారు 198 చోట్ల బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉన్నందున, డబ్లింగ్ పూర్తయ్యేందుకు మూడేళ్ల సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

25శాతం పనులు పూర్తి

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేపట్టిన పను లు 25 శాతం వరకు పూర్తయ్యాయి. ప్లాట్‌ఫాం పను లు పూర్తికాగా, ఇతర అప్‌గ్రేడ్ పనులు కొనసాగుతున్నా యి.కాంట్రాక్టర్‌తో చర్చించి నిర్ణీతకాలంలో పనులు పూర్తయ్యేలా చూస్తాం.

- తారకేశ్వరరాజు, మిర్యాలగూడ రైల్వే స్టేషన్ మేనేజర్

డబ్లింగ్ సర్వే పనులు కొనసాగుతున్నాయి

డబ్లింగ్‌కు యాదాద్రి జిల్లాలో రెవెన్యూశాఖ అధికారులతో కలిసి సర్వే నిర్వహించాం. మిర్యాలగూడ డివిజన్ కుక్కడం-వాడపల్లి మధ్య కొన్ని చోట్ల భూ సర్వే కొరకు సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపాం. వారు సర్వేయర్లను ఏర్పాటు చేస్తే తక్కువ సమయంలోనే సర్వేను పూర్తి చేస్తాం.

- లక్ష్మణ్, రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్



రూ.9.5కోట్లతో మిర్యాలగూడ స్టేషన్‌కు కొత్తహంగులు

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా తెలంగాణలో చేపట్టిన 15 స్టేషన్ల అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌కు గత ఫిబ్రవరిలో రూ.9.5కోట్లు మంజూరు చేసింది. వీటితో స్టేషన్ ఆధునికీకరణ పనులు చేపట్టినట్టు రైల్వే అధికారులు తెలిపారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా రైల్వే ప్రయాణికుల కోసం ప్లాట్‌ఫాం ఆధునికీకరణ,లిఫ్ట్, ఎస్కలేటర్, ఎగ్జిక్యూటివ్ లాంజ్,వెయిటింగ్ ఏరియా, దివ్యాంగులకు అనుకూలమైన సౌకర్యాల కల్పన, బహుళస్థాయి పార్కింగ్ ఏర్పాటు తదితర పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే ప్లాట్‌ఫాం పనులు పూర్తికాగా,ఇతర పనులు కొనసాగుతున్నాయి.



రామన్నపేట వద్ద సర్వే నిర్వహిస్తున్న రైల్వే అధికారులు (ఫైల్)

ఆయకట్టులో సాగునీటి సవ్వడులు

సాగర్, పులిచింతల గేట్ల నుంచి నీటి విడుదల •7లో..

రాష్ట్రానికి మార్గదర్శకంగా నిలవాలి

రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీసీఎల్ఏ నవీన్‌మిత్తల్



సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిత్తల్

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 7: మండలంలోని భూ సమస్యలను నూటికి నూరుశాతం పరిష్కరించి రాష్ట్రానికి మార్గదర్శకంగా నిలిపేందుకు తిరుమలగిరి(సాగర్) మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీసీఎల్ఏ నవీన్‌మిత్తల్ తెలిపారు. బుధవారం మండలంలోని చింతలపాలెం గ్రామంలో భూ సమస్యల పరిష్కారానికి రైతులతో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఆర్‌వోఆర్ చట్టంలో సాదాబైనామా, విరాసత్‌లో కొన్ని సమస్యలు తీర్చడానికి ఇబ్బందులున్నాయని, అందుకే కొత్త ఆర్‌వోఆర్ చట్టాన్ని త్వరలోనే తీసుకురానున్నామని తెలిపారు. ఈ క్రమంలో పారదర్శకత ద్వారా కొత్త చట్టాన్ని తెచ్చేందుకు ముసాయిదాను ప్రజల ముందుకు తీసుకొచ్చామని, ఈ చట్టంలో మార్పులు, చేర్పులు, ఇతర అభిప్రాయాలను స్వేచ్ఛగా తెలియజేయవచ్చన్నారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డిల సూచనలతో తిరుమలగిరి(సాగర్) మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రకటించినట్లు తెలిపారు. మండలంలో ప్రభుత్వ, కాందీశీకుల, ఫారెస్ట్ భూములకు సంబంధించిన సమస్యలు అత్యధికంగా ఉన్నాయని, రైతులు, రెవెన్యూ అధికారుల ద్వారా తెలుసుకున్నామని, వాటన్నింటిని పరిష్కరించి రైతులకు న్యాయం చేసేలా కృషి చేస్తామన్నారు. భూముల సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనంచేసి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ఫలితాలను రాష్ట్రమంతటా అమలు చేస్తాం

ఈ పైలట్ ప్రాజెక్టులో భాగంగా వచ్చిన ఫలితాలను రాష్ట్రమంతటా అమలు చేస్తామని నవీన్‌మిత్తల్ తెలిపారు. ఈ సందర్భంగా పలు తండాలు, గ్రామాలనుంచి వచ్చిన రైతులనుంచి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ధరణి కమిటీ సభ్యుడు భూమి సునీల్ మాట్లాడుతూ సేద్యంలో భూమి, రికార్డులో పేరు, చేతిలో పట్టా ఉంటేనే రైతుకు తన భూమిపై సంపూర్ణ హక్కు ఉన్నట్లు గుర్తించాలన్నారు. ఎవరికైతే భూమి ఉందో, హక్కులు ఉన్నాయో, వారే రికార్డులోకి రావాలని, వారికే పట్టా దక్కాలన్న ఉద్దేశ్యంతో ఈపైలట్ ప్రాజెక్టును ఎంపిక చేసినట్లు తెలియజేశారు. మండలంలో రైతుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు తహసీల్దార్ నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల వరకు రైతుల సమస్యలపైనే దృష్టి పెట్టారని, ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని భూ సమస్యలు ఈ దఫాలో పరిష్కారమవుతాయని రైతులకు హామీ ఇచ్చారు. అదేవిధంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ మండలంలో ప్రధానంగా ఏడు రెవెన్యూ గ్రామాల శివారుల్లో ప్రభుత్వ, ఫారెస్ట్, అటవీ, ప్రభుత్వ సరిహద్దు వివాదాలు ఉన్నాయన్నారు. గత రెండు రోజులుగా చేస్తున్న సర్వే ద్వారా కొన్ని రెవెన్యూకు సంబంధించిన అంశాలు వెలుగులోకి వచ్చాయని, వాటన్నింటిని క్షేత్రస్థాయిలో సర్వే చేయడం ద్వారా పరిష్కారమవుతాయన్నారు. మండలంలో అటవీ, రెవెన్యూ సరిహద్దు వివాదం సుమారు 12వేల ఎకరాల్లో ఉందని, ఈ సమస్యలను జాయింట్ సర్వే చేయడం ద్వారా పరిష్కరించనున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం 12,131 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ భూములు ఉన్నాయని, అందులో సుమారు 7,161 ఎకరాలు చింతలపాలెం, నెల్లికల్లు, జమ్మనకోట, తిమ్మాయిపాలెం గ్రామాల్లోనే ఉన్నట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం 3,931 ఎకరాలు ధరణిలో నమోదైందని, వాటిలో కొందరు అనర్హులున్నారని ఇటీవల సర్వేలో తేలిందన్నారు. మిగిలిన అర్హులైన రైతుల వివరాలను ధరణిలో తీసుకురావాల్సి ఉందన్నారు. చింతలపాలెం, తిమ్మాయిపాలెం, నాయకునితండా గ్రామాల్లో కాందీశీకుల భూములు సుమారు 2,871 ఎకరాలున్నాయని, వారి సమస్యను పరిష్కరించేందుకు ఖాస్తు కబ్జా సర్వే చేస్తున్నామన్నారు. సీసీఎల్ఏ కార్యాలయ అధికారి లచ్చిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామస్థాయి రెవెన్యూ ఉద్యోగులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సందర్భంగా పలువురు రైతులు తాము ఎదుర్కొంటున్న భూ సమస్యల గురించి సమావేశంలో ఉన్నతాధికారులకు తెలిపారు.

ఐదు దశాబ్దాలుగా కబ్జాలో ఉన్నా



సుమారు 2,500ఎకరాల్లో పేద రైతులమైన మేము ఐదు దశాబ్దాలుగా కాంధీశీకుల భూములను సేద్యం చేసుకుంటున్నాం. గతంలో మా పేర్లను రికార్డులో నమోదు చేసినప్పటికీ ధరణి వచ్చినప్పటినుంచి మమ్మల్ని గుర్తించడంలేదు. దీని వల్ల రైతుబంధు, రుణమాఫీ, రైతుబీమాలాంటివి పొందలేకపోతున్నాం. అధికారులు మా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలి.

- మెరావత్ మునినాయక్, రైతు, నాయకునితండా

అర్హులైన రైతులను గుర్తించేలా సర్వే చేయించాలి



దశాబ్దాలుగా ఇక్కడి భూములను మేమే బాగు చేసుకొని సేద్యం చేసుకుంటున్నాం. అయినప్పటికీ గత ఎనిమిదేళ్ల నుంచి పాస్ పుస్తకాలు రాకపోవడంతో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నాం. సేద్యం చేస్తున్న అర్హులైన రైతులను గుర్తించాలంటే పకడ్బందీగా సర్వే చేయాలి. టెయిల్‌పాండ్ బ్యాక్ వాటర్‌లో మునిగిన సీతారామచంద్రస్వామి ఆలయ భూములకు పరిహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలి.

- రామయ్య, రైతు, చింతలపాలెం

గడువులోగా సీఎంఆర్ బకాయి పూర్తి చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్న అధికారులు

నల్లగొండ, ఆగస్టు 7: ప్రభుత్వం విధించిన గడువులోగా సీఎంఆర్ బకాయిని వంద శాతం పూర్తి చేయాలని అధికారులను పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సెప్టెంబరు 30లోగా గత సీజనల్‌లోని డిఫాల్టర్ రైస్ మిల్లుల నుంచి త్వరితగతిన బకాయిలను రాబట్టాలన్నారు. నెల గడువులోగా 2022-23 యాసంగి ధాన్యం సేకరణ పూర్తి చేసి, 2024-25 వానాకాలం ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా అధికారులు మాట్లాడుతూ, సీఎంఆర్ బకాయిల సేకరణ మెరుగ్గా ఉందని, విధించిన గడువులోగా 2022-23కు నిర్దేశించిన మొత్తం ఎగుమతి పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

‘స్వచ్ఛదనం-పచ్చదనం’తో ఆరోగ్యం, వనసంపద

▸▸ ఇంటింటికీ మొక్కలు నాటాలి ▸▸ ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి సురేంద్రమోహన్



ఆరెగూడెంలో మొక్క నాటి నీరుపోస్తున్న ‘స్వచ్ఛదనం పచ్చదనం’ నోడల్ అధికారి సురేంద్రమోహన్

చిట్యాలరూరల్, ఆగస్టు 7: ‘స్వచ్ఛదనం-పచ్ఛదనం’తో వనసంపదను భావితరాలకు అందించాలని కార్యక్రమ ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి సురేంద్రమోహన్ అన్నారు. బుధవారం ‘స్వచ్ఛదనం-పచ్ఛదనం’ కార్యక్రమాన్ని మండలంలోని ఆరెగూడెంలో ఆయన పరిశీలించారు. ప్రాథమికోన్నత పాఠశాలలో అదనపు కలెక్టర్ పూర్ణచందర్, డీఆర్డీవో నాగిరెడ్డి, డీపీవో కె.మురళి, పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. నాటిన మొక్కలను విద్యార్థులు దత్తత తీసుకుని నిత్యం నీటినందించాలని సూచించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని, ఇతరులు కూడా ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్రతీ ఇంటిలో మొక్కలు నాటి వాటిని పర్యవేక్షించాలన్నారు. రహదారి పక్కన, గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటాలని గ్రామస్థులకు సూచించారు. మొక్కలు వృక్షాలుగా ఎదిగి చల్లటి నీడనందిస్తాయని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, ప్రాణవాయువును అందించడంతో పాటు వాతావరణ సమతుల్యను కాపాడుతాయన్నారు. పండ్లు, పూల మొక్కలతో పాటు ఔషధ గుణాలున్న మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్పీ జయలక్ష్మి, ఇరిగేషన్‌శాఖ డీఈ నర్సింహ, ఎంపీవో సత్యనారాయణ, ఏపీవో వనం శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు శారద, కృష్ణయ్య, లింగస్వామి, శ్రీధర్‌రెడ్డి, కంచర్ల గౌతమ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య సిబ్బంది ఉత్సాహంగా పనిచేయాలి

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

నల్లగొండ, ఆగస్టు 7: వైద్య ఆరోగ్య సిబ్బంది ఉత్సాహంతో పనిచేసి జిల్లాను అన్ని రంగాల్లో ముందు ఉంచాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీల్లో సూపర్‌వైజర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, పబ్లిక్ హెల్త్ నర్సులు, హెల్త్ ఎడ్యుకేటర్లు మొత్తం 105మంది వరకు ఉన్నారని, వీరిలో చాలా మంది సీనియర్లు ఉన్నారన్నారు. 15 నుంచి 20 సంవత్సరాలుగా హెల్త్ అసిస్టెంటుగా, ఎంఎస్‌ఎఫ్‌గా పనిచేసిన వారు ఉన్నారని, వీరు ఇప్పుడు సూపర్‌వైజర్ స్థానంలో ఉన్నారన్నారు. సీనియర్లు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని కోరారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మూమెంట్ రిజిస్టర్లు రాసి టూర్లకు వెళ్లాలని సూచించారు.

పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

నార్కట్‌పల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, ల్యాబ్, ఫార్మసీ, పేషెంట్ బెడ్‌రూంలను పరిశీలించారు. ఆయన వెంట మండల వైద్యాధికారి ఆదిత్య, సీహెచ్‌వో బడుగు శ్రీరాములు, తదితరులు ఉన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

భువనగిరి అర్బన్, ఆగస్టు 7: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి, తులసీదళాలతో సహస్రనార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు నిర్వహించారు. సాయంత్రం అంకార వెండి జోడు సేవలు, సహస్రనార్చనలు జరిపారు.ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.12,81,890ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఇదిలా ఉండగా హుండీ కానుకలను అధికారులు, సిబ్బంది లెక్కించగా ఖజానాకు రూ.2,66,68,787 ఆదాయం సమకూరాయి.

ఆయకట్టులో సాగునీటి సవ్వడులు

కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో ఏడాది తర్వాత నీటి సవ్వడులు ప్రజల్లో ఆనందాలను నింపుతోంది. తాజాగా సాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలైన నీటితో పులిచింతల ప్రాజెక్టులోనూ నీటి నిల్వలు గరిష్ఠ స్థాయికి చేరాయి. అటు నదీ ప్రవాహ ప్రాంతంతో పాటు ఆయకట్టు ప్రాంతంలోని కాల్వల్లో నీటి ప్రవాహం భవిష్యత్‌పై భరోసాగా కనిపిస్తోంది. దీంతో అందరిలో ఆనందం కనిపిస్తోంది.



నాగార్జునసాగర్ / కేతేపల్లి, ఆగస్టు 7: నాగార్జునసాగర్‌కు ప్రాజెక్టుకు ఎగువ నుంచి బుధవారం స్వల్పంగా వరద రాక తగ్గింది. దీంతో మంగళవారం 22 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని విడుదల చేసిన అధికారులు బుధవారం ఉదయం, మధ్యాహ్నం రెండు చొప్పున నాలుగు గేట్లను మూసివేసి 18 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటినివిడుదల చేస్తున్నారు. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3,32,364 క్యూసెక్కుల నీరువచ్చి చేరుతోంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885(215.8070 టీఎంసీలు)అడుగులు కాగా, ప్రస్తుతం 883.80(203.4290టీఎంసీలు)అడుగులుగా ఉంది. దీంతో ప్రాజెక్టు 10 క్రస్ట్ గేట్లను 10 అడుగులు మేర ఎత్తి, అలాగే రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు 3,74,658క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590(312.5050టీఎంసీలు) అడుగులు కాగా, బుధవారం సాయంత్రానికి 584.80అడుగులు (296.5695టీఎంసీలు)గా ఉంది.సాగర్ నుంచి కుడికాల్వకు 6,873క్యూసె క్కులు, ఎడమకాల్వకు 8,193 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,070క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, 4క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేరకు, 14 క్రస్ట్‌గేట్లను 10అడుగుల మేరకు ఎత్తి 2,24,964 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,70, 900 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ఎగువ నుంచి 3,74,658 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.



డ్యాంపైన సీసీఎల్‌ఏ నవీన్ మిత్తల్, నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

సాగర్‌ను సందర్శించిన ప్రముఖులు

సాగర్ క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో వివిధ హోదాల్లో ఉన్న ప్రముఖులు సాగర్‌ను సందర్శించారు. సాగర్‌ను సందర్శించిన వారిలో సీసీఎల్‌ఏ నవీన్ మిత్తల్, నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, సూర్యాపేట డిప్యూటీ కలెక్టర్ లత, నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కుటుంబసమేతంగా సాగర్ సందర్శించారు. సీసీఎల్‌ఏ ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్ సాగర్ ప్రధానడ్యాంను సందర్శించిన అనంతరం జలాశయంలో పర్యాటకశాఖ లాంచీలో జాలీ ట్రిప్పులో తిరిగారు.

పనిచేయని రెండో టర్బైన్

నాగార్జునసాగర్ ఎడమకాల్వ జలవిద్యుత్ కేంద్రంలో 80మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల రెండు టర్బైన్‌లు ఉన్నాయి. అందులో రెండో టర్బైన్‌లోకి 2014 నవంబరులో నీరు చేరడంతో మరమ్మతులకు గురైంది. ఆ తర్వాత రెండేళ్లకు మరమ్మతులు చేసి 2016 నుంచి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. మరోసారి రెండో టర్బైన్ 2022 డిసెంబరులో మరమ్మతులకు గురైంది. దీంతో అప్పటి నుంచి మరమ్మతులు చేస్తూనే ఉన్నారు. 2023లో నీటినిల్వలు లేకపోవడంతో విద్యుదుత్పత్తి చేయలేదు. కానీ నేటికీ మరమ్మతులు పూర్తికాలేదు. దీంతో ప్రస్తుతం ఒక టర్బైన్ ద్వారా 4,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ఏడాది తర్వాత ప్రాజెక్టుకు భారీ వరద వస్తున్నా ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో కానీ, ఎడమ కాల్వ జలవిద్యుత్ కేంద్రంలో కానీ జెన్‌కో అధికారులు పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి చేయలేకపోతున్నారు.

ఈ సీజన్‌లో పెద్దఎత్తున నష్టం

సాగర్‌లో నీటినిల్వలు పుష్కలంగా ఉన్న తరుణంలో రెండో టర్బైన్ మరమ్మతులకు గురికావడం చర్చనీయాంశమైంది. ఎడమ కాల్వపై ఉన్న విద్యుదుత్పత్తి కేంద్రంలో ఒక్కో టర్బైన్ ద్వారా 80 మెగావాట్ల చొప్పున ప్రతిరోజూ 160 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుండేది. అయితే రెండో టర్బైన్ మరమ్మతుకు గురికావడం ద్వారా మూడు నెలల కాలానికి సుమారు ప్రతిరోజూ 80 మెగావాట్ల చొప్పున 7,200 మెగావాట్ల విద్యుదుత్పత్తిని కోల్పోవాల్సి వస్తోంది. ఒక టర్బైన్ పనిచేస్తున్న సమయంతో పాటు ఎడమ కాల్వకు నీటిని విడుదల చేస్తుండగా టర్బైన్ మరమ్మతులు సాధ్యం కావని నిపుణులు చెబుతున్నారు. ఆ లెక్కన రెండో టర్బైన్ మరమ్మతులు పూర్తికావడానికి ఏడాది సమయం పట్టవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

డ్యాం ఎదుట పర్యాటక కుటుంబం




నిండుకుండలా పులిచింతల

మేళ్లచెర్వు : ఎగువ నుంచి వరద పోటెత్తడంతో తెలుగురాష్ట్రాల సరిహద్దుల్లోని పులిచింతల ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఎగువన ఉన్న నాగార్జునసాగర్ నుంచి బుధవారం సాయంత్రం ఆరు గంటలకు 2,50,518 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో ప్రాజెక్టు ఆరు రేడియల్‌గేట్లను రెండున్నర మీటర్లు, ఏడు గేట్లను మూడు మీటర్లు ఎత్తి 2,78,573 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175(42.16టీఎంసీలు)అడుగులు కాగా, ప్రస్తుతం 168.86(36.78టీఎంసీ) అడుగులకు చేరుకుంది. విద్యుదుత్పత్తి చేస్తూ 10వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.వరద నిలకడగా కొనసాగుతుండటంతో వచ్చిన నీటిని వచ్చినట్టే దిగువకు వదులుతున్నారు.

పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి

పులిచింతల ప్రాజెక్టు వద్ద ఎడమ వైపు ఉన్న తెలంగాణ జెన్‌కో పవర్ ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. మంగళవారం ఉదయం 9గంటలకు ప్రాజెక్టులో నీటి నిల్వలు 10టీఎంసీలకు చేరుకోగానే 3,600 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్లలో ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 5,600 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. రెండు యూనిట్ల ద్వారా 40 మెగావాట్ల విద్యుదుత్పత్తిని చేశారు. మంగళవారం రాత్రి మరో రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. 10వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 80 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.





పులిచింతల బ్యాక్‌వాటర్‌లో మునిగిన మట్టపల్లి క్షేత్ర సమీపంలోని మెట్లు

మట్టపల్లి క్షేత్ర కరకట్టకు చేరువలో నీరు

మఠంపల్లి : పులిచింతల ప్రాజెక్టులో నీటినిల్వలు రోజు రోజుకూ పెరుగుతుండటంతో బ్యాక్‌వాటర్ మట్టపల్లి ఆలయానికి సమీపానికి చేరుకుంటోంది. రెండు రోజుల కిందటి వరకు నీరు లేక పుష్కరఘాట్లు వెలవెలబోయాయి. సాగర్ నుంచి వస్తున్న వరదతో పులిచింతల ప్రాజెక్టులో గరిష్ఠ నీటి నిల్వలు 42.16 టీఎంసీలకు బుధవారం సాయంత్రానికి 36.78 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో మఠంపల్లి మండలం మట్టపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రం సమీపంలోని పుష్కరఘాట్లు, మెట్లు పూర్తిగా మునిగిపోయాయి. 2022లో ప్రాజెక్టులో గరిష్ఠ స్థాయిలో నీటినిల్వలతో ఆలయంలోకి వరద చేరింది. మరో మూడు టీఎంసీల నీరు పెరిగితే కరకట్ట లీకేజీ ద్వారా ఆలయంలోకి నీరు చేరే అవకాశం ఉంది.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో





సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం మహంకాళిగూడెం వద్ద కృష్ణమ్మ పరువళ్లు

కేతేపల్లి : ఎగువన మూసీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రానికి 370.08క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో బుధవారం సాయంత్రానికి 334.54 క్యూసెక్కులుగా నమోదైంది. 645(4.46టీఎంసీలు)అడుగుల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులో ప్రస్తుతం 641.50 (3.57టీఎంసీ)అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. మరోవైపు మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం కుడి కాల్వకు 69.39 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 208.17క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రతి ఎకరాకూ సాగు నీరందిస్తాం: ఎమ్మెల్యే బాలునాయక్

డిండి, ఆగస్టు 7: దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకూ సాగు నీరందించే బాధ్యత తనదని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. బుధవారం డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన ప్యాకేజీ-1 సొరంగం పనులకు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి నల్లగొండ జిల్లా డిండి మండలం వీరబోయినపల్లి వద్ద భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రైతులు, నీటి పారుదల శాఖ అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెయిన్‌కాల్వ 22.15 కిలోమీటర్ నుంచి 23.22 కిలోమీటర్ వరకు 1.75 కిలోమీటర్ల సొరంగం పనులను తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలని అధికారులను కోరారు. మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తి చేస్తామన్నారు. డిండి ఎత్తిపోతలకు ఏదుళ్ల రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకోవాలని అచ్చంపేట, దేవరకొండ ఎమ్మెల్యేలు అధికారులను ఆదేశించారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ సహకారంతో కల్వకుర్తి ఎత్తిపోతల నీటి ద్వారా డిండి ప్రాజెక్టును నింపి రైతుల పొలాలకు నీరు అందిస్తామన్నారు. డిండి మండలంలో 67 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మోడల్ స్కూల్ ఆవరణంలో స్వచ్ఛదనం-పచ్చదనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మాధవరం దేవేందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్లవెల్లి రాజేష్‌రెడ్డి, ఏఈ శ్రీధర్‌రావు, జైపాల్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్, ఎండీవో డానియెల్, నాగార్జునరెడ్డి, ఎంఈవో సామ్యానాయక్, గుర్రం రాములు, శ్రీనివాస్‌గౌడ్, మేకల సాయమ్మకాశయ్య, జంగారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పొలం లక్ష్మణ్, గడ్డమీది సాయి, పోల వెంకటేష్, వెంకటయ్య, వెంకటరమణ, బుచ్చిరెడ్డి, షైనోద్దీన్, లక్‌పతినాయక్ పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్, వంశీకృష్ణ

26 చెరువులను గోదావరి జలాలతో నింపుతాం

తుర్కపల్లి, ఆగస్టు 7: కొండపోచమ్మ రిజర్వాయర్ నీటితో యాదాద్రిభువనగిరి జిల్లాలోని తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాల్లోని 26 చెరువులను నింపి సాగుకు నీటిని అందిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం కొండపోచమ్మ రిజర్వాయర్ సమీపంలోని వెంకటాపూర్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన తుర్కపల్లి, తుర్కపల్లి(ఎం) గేట్ల వద్ద అయిలయ్య బుధవారం రాత్రి పూజలు చేసి గేట్లు ఎత్తి సాగునీటిని వదిలారు. దీంతో తుర్కపల్లి కెనాల్, తుర్కపల్లి(ఎం)కెనాల్ ద్వారా గోదావరి జలాలు పరవళ్ళు తొక్కుతూ మండలంలోని గోపాలపురం, కొండాపూర్, వాసాలమర్రి చేరుకున్నాయి. ఇదిలా ఉండగా మండలంలో కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో చెరువుల్లోకి గోదావరి జలాల విడుదలతో ఆయా గ్రామాల్లో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టు ఇన్‌చార్జి డీఈలు శ్రీధర్, సురేశ్‌బాబు, ఆలేరు మార్కెట్ మాజీ చైర్మన్ ధనావత్ శంకర్‌నాయక్, తహసీల్దార్ జీ దేశ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొమిరిశెట్టి నర్సింహులు, యాదగిరిగుట్ట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలు యాదవ్, మాజీ ఎంపీటీసీ ధనావతు మోహన్‌బాబు, మండల మహిళా అధ్యక్షురాలు ఐనాల చైతన్య, నాయకులు భూక్య రాజారాంనాయక్, పనగట్ల సుదర్శన్, బోరెడ్డి మహిపాల్‌రెడ్డి, కొన్నె దుర్వాసులు, గడ్డమీది నిఖిల్‌గౌడ్, బాబునాయక్, ఇంద్రపాల కృష్ణ తదిరులు ఉన్నారు.



గేట్ తిప్పుతున్న విప్ అయిలయ్య

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం


చౌటుప్పల్ రూరల్ ఆగస్టు 7: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా మాడుగుల మండలం గుర్రపుగూడెం గ్రామానికి చెందిన సుంకిరెడ్డి మధుకర్‌రెడ్డి(36) బత్తాయిపండ్ల లోడుతో ట్రాక్టర్ డ్రైవర్ మల్లె వెంకట్‌రెడ్డితో కలిసి బాటసింగారం ఫ్రూట్ మార్కెట్‌కు బయలుదేరాడు. వెనక నుంచి డీసీఎం ఢీకొనడంతో డ్రైవర్ పక్కన మధుకర్‌రెడ్డి తలపగిలి మృతి చెందాడు.

రూ.5కోట్లు అప్పు ఇస్తామని ఆశపెట్టి టోకరా

● 24 గంటల్లో నిందితుల అరెస్ట్‌చేసిన నల్లగొండ జిల్లా పోలీసులు

మిర్యాలగూడ, ఆగస్టు 7: వడ్డీ రూపంలో అప్పు ఇస్తామని చెప్పి రూ.60 లక్షలు టోకరా వేసిన ముఠాను ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే నల్లగొండ జిల్లా పోలీసులు పట్టుకుని, కటకటాల్లోకి పంపారు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని చందానగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్‌సమీర్ నిజామాబాద్‌లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. కొత్త వెంచర్ కోసం డబ్బు చెల్లించాల్సి ఉండటంతో అప్పు కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో డబ్బు కోసం శ్రీకాంత్ అనే మధ్యవర్తి ద్వారా నల్లగొండ జిలా మిర్యాలగూడకు చెందిన కండెల గణేష్, కండెల మల్లిఖార్జున్‌ను సంప్రదించాడు.సమీర్‌కు అప్పుగా రూ.5కోట్లు ఇవ్వడానికి ఒప్పుకొని జూలై 31న అతడిని నమ్మించేందుకు రూ.90లక్షలు ఇచ్చారు. సమీర్ నుంచి ఇంటి దస్తావేజులు, ప్రాంసరీ నోట్లు, బ్లాంక్ చెక్కులు తీసుకున్నారు. మిగతా డబ్బు గురించి అడగ్గా తాము ఇచ్చిన రూ.90లక్షలు, అప్పు ఇవ్వబోయే రూ.5కోట్లకు ముందస్తుగా వడ్డీ రూ.60లక్షలు తీసుకుని ఈ నెల 5వ తేదీన మిర్యాలగూడకు రావాలని చెప్పారు. డబ్బు అత్యవసరం కావడంతో ముందస్తుగా వడ్డీ చెల్లించేందుకు అంగీకరించి మరో ఇరువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులను వెంట తీసుకుని మందుగా వారు అప్పుగా ఇచ్చిన రూ.90లక్షలు, ముందస్తు వడ్డీ రూ.60లక్షలు మొత్తం రూ.కోటిన్నర నగదు వెంట తీసుకెళ్లారు. ఈ నెల 5సాయంత్రం 4గంటలకు వారు చెప్పిన అడ్రస్ ప్రకారం మిర్యాలగూడ గాంధీనగర్‌లోని వీరన్న ఇంటికి చేరుకున్నారు. రూ.60లక్షలు కాజేయాలనే పథకంతో ఉన్న నిందితులు గణేష్, మల్లిఖార్జున్, విజయ్, రాజు, గంగమ్మ, ఎల్‌బీనగర్‌కు చెందిన చిక్కు వెంట్రుకల వ్యాపారి కండెల అనుపమ, హైదరాబాద్ కొంపెల్లికి చెందిన వంటపని చేసే కండెల వెంకటమ్మ, మిర్యాలగూడ గాంధీనగర్ కండెల వీరమ్మ అప్పటికే ఆ ఇంటికి చేరుకున్నారు. సమీర్ అతడి స్నేహితులతో మాట్లాడి వారి వద్ద నుంచి తాము ఇంతకుముందు ఇచ్చిన రూ.90లక్షలు తీసుకొని చెక్కులు, ప్రాంపసరీ నోట్లు, ఇంటి కాగితాలు వారికి తిరిగి ఇచ్చివేశారు. రూ.5కోట్ల అప్పు గురించి గణేష్, మల్లిఖార్జున్‌లను అడగ్గా వడ్డీ డబ్బులు తెచ్చారా ముందు చూపించాలని సమీర్‌ను అడగడంతో ఆయన తన వెంట తెచ్చిన బ్యాగును తెరిచి రూ.60లక్షలను చూపించబోయాడు. కండెల గణేష్, మల్లిఖార్జున్, విజయ్, రాజు కలిసి సమీర్ అతడి స్నేహితులపై దాడి చేసి నగదు ఉన్న బ్యాగును తీసుకుని పరారయ్యారు. జరిగిన మోసాన్ని గ్రహించి సమీర్ అతడి స్నేహితులు నిందితులను వెంబడించే ప్రయత్నం చేయగా, అక్కడే ఉన్న గంగమ్మ, అనుపమ, వీరమ్మ, వెంకటమ్మ అడ్డుకుని రాళ్లతో దాడి చేస్తూ మరోవైపు పారిపోయారు. తమ డబ్బు దోచుకొని పరారైన ఘటనపై సమీర్ అదేరోజు రాత్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు డీఎస్పీ రాజశేఖరరాజు ఆదేశాల మేరకు వన్‌టౌన్, టౌటౌన్ సీఐలు సుధాకర్, నాగార్జున ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. బుధవారం ఉదయం నిందితులు అనుపమ, వీరమ్మ, గంగమ్మను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.60లక్షల నగదు, డబ్బు లెక్కింపు యంత్రం, యాపిల్, రెడ్‌మీ స్మార్ట్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మిగతా నిందితులు మిర్యాలగూడకు చెందిన కండెల గణేష్, మల్లిఖార్జున్‌లు హైదరాబాద్‌కు చెందిన విజయ్, రాజు, వీరన్న, గంగమ్మ పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. కాగా, పట్టుబడిన నిందితులపై గతంలో రాచకొండ కమిషనరేట్ పరిధి ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదైనట్లు తెలిపారు. 24గంటల్లో కేసును ఛేదించిన డీఎస్పీ, సీఐలను ఎస్పీ అభినందించారు.

పోలీస్‌స్టేషన్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న అనిల్

నేరేడుచర్ల, ఆగస్టు 8: దాడి ఘటనలో ఓ యువకుడిని పోలీస్‌స్టేషన్‌కు పిలవగా, కేసు నమోదు చేస్తారనే భయంతో ఆ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం జరిగింది. స్థానికులు, నేరేడుచర్ల ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బూర్గులతండాకు చెందిన లావూరి భారిత, మాలోతు మంగ్లి వ్యవసాయ భూములు పక్కపక్కనే ఉన్నాయి. పొలంగట్లు చెక్కిన విషయంలో ఇద్దరి మధ్య ఈ నెల 4వ తేదీన గొడవ జరిగింది. ఈ సందర్భంగా భారితపై మంగ్లి కుమారుడు అనిల్ దాడిచేశాడు. తనపై దాడి చేసిన అనిల్‌పై పోలీసులకు భారిత ఫిర్యాదు చేసింది. ఈ విషయమై పోలీసుల సూచన మేరకు ఇరువర్గాలు పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకుంటుండగా, రాజీకి అంగీకరించబోనని, తన తల్లిపై దాడి చేసిన అనిల్‌పై కేసు పెట్టాలని భారిత కుమారుడు నరేందర్ పోలీసులకు స్పష్టం చేశాడు. ఈ విషయమై ఓ కానిస్టేబుల్ అనిల్ ఇంటికి వెళ్లి పోలీస్‌స్టేషన్ రావాలని కోరాడు. ఇంటి నుంచి పురుగు మందు డబ్బాను తెచ్చుకున్న అనిల్, పోలీసులు తనపై కేసు నమోదు చేస్తారనే ఆందోళనతో పోలీస్‌స్టేషన్‌లోనే పురుగు మందు మూత తీసి కొంచెం తాగాడు. పక్కనే ఉన్న హోంగార్డు వెంకటయ్య దీన్ని గమనించి పురుగుమందు డబ్బాను లాగేశాడు. అనిల్‌ను చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.4 కోట్ల అప్పులు చేసి ఉడాయించిన వ్యాపారి

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 7: నాలుగు కోట్లకు పైగా అప్పులు చేసి ఓ కిరాణం వ్యాపారి ఉడాయించాడు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పీపల్ పహాడ్ గ్రామానికి చెందిన కామిశెట్టి పాండు(47) గ్రామంలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. దుకాణంతో పాటు ఇతర వ్యాపారాలు కూడా నిర్వహిస్తుంటాడు. ఇందుకోసం భారీగా వడ్డీ ఆశ చూపి ప్రజల నుంచి రూ.4 నుంచి రూ.5 కోట్ల వరకు అప్పులు తీసుకున్నాడు. రూ.2 నుంచి రూ.10 వరకు వడ్డీ చెల్లించాడు. ఒక్కో కుటుంబంలో కుటుంబ సభ్యులకు తెలియకుండా అందరి వద్దా లక్షలలో అప్పుతీసుకున్నాడు. రూ.లక్ష నుంచి రూ.60 లక్షల వరకు ప్రజలు పాండుకు అప్పులుఇచ్చారు. క్రమం తప్పకుండా వడ్డీ చెల్లిస్తుండటంతో ప్రజలునమ్మారు. ఇటీవల కొన్ని నెలల నుంచి వడ్డీ చెల్లించడం లేదు. దీంతో అనుమానం వచ్చిన బాధితులు డబ్బుల కోసం ఒత్తిడి తేచ్చారు. బాధితుల ఒత్తిడి పెరగడంతో ఇంటి నుంచి పరారయ్యాడు. భార్య, పిల్లలను ఇంటి వద్దే వదిలి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి 10 రోజుల కిందట పరారయ్యాడు. బాధితులు పాండు ఇంటి వద్ద రోజు ఆందోళన చేశారు. ఆయన ఆచూకీ లభించకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి : లక్ష్మారెడ్డి



గూడూరులో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 7: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'స్వచ్ఛదనం - పచ్చదనం' ఐదు రోజుల కార్యక్రమంలో భాగంగా మూడవరోజు మండలంలోని గూడూరు, తుంగపాడు గ్రామాల్లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పర్యావరణ పరిరక్షణ కోసం పట్టణాలు, గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి ఐదు రోజుల వినూత్నమైన కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని అన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ప్రస్తుత సీజన్‌లో విషజ్వరాలు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గూడూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు కంచుకట్ల లింగయ్య, మచ్చ వెంకన్న, విజయ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

మిర్యాలగూడ టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. సీపీఎస్ ఉద్యోగులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని పచ్చగా, పరిశుభ్రంగా మార్చేందుకు చర్యలు చేపట్టడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో వల్లపుదాసు భూలక్ష్మి, తోట యోగిందర్, సతీష్‌కుమార్, నాగయ్య, చంద్రశేఖర్, స్వర్ణలత, రమాదేవి, మౌనిక, అచ్చాలి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి : బాలునాయక్



ముదుదండ్లలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట, ఆగస్టు 7: ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చందంపేట మండలంలోని ముదుదండ్ల, చందంపేట మండల కేంద్రంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని మొక్కలు నాటి మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, మొక్కలు నాటి భావితరాలకు మంచి వాతావరణం అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బద్యానాయక్, పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి, సత్తిరెడ్డి, అనంతగిరి, వంశీశర్మ, ఎంపీడీవో లక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన వరదకాల్వ గండిని పూడ్చాలి

హాలియా, ఆగస్టు 7: అనుముల మండలం మారేపల్లి గ్రామ సమీపంలో వరదకాల్వ 36 కిలోమీటరు మీటర్ వద్ద పడిన గండిని యుద్ధప్రాతిపాదికన వెంటనే పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ డిమాండ్ చేశారు. బుధవారం గండిపడిన ప్రాంతాన్ని ఆయన రైతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వరదకాల్వ సుమారు 50 వేల ఎకరాలకు సాగు నీరందిస్తూ, 30 చెరువులు, కుంటలను నింపుతుందన్నారు. తక్షణమే యుద్ధప్రాతిపదికన వరదకాల్వకు పడిన గండిని పూడ్చి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, నాయకులు మజ్జిగపు వెంకట్‌రాంరెడ్డి, నర్సిరెడ్డి, సత్తయ్య, ఈదయ్య, ఆనంద్, శ్రీకాంత్, అంజయ్య, తాటి సత్యపాల్, కామెర్ల జానయ్య, సుధాకర్, రాంబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం - పచ్చదనం' ప్రతి ఒక్కరి బాధ్యత

హాలియా: స్వచ్ఛదనం - పచ్చదనం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీవో సుజాత అన్నారు. మండలంలోని చల్మారెడ్డిగూడెం, కొత్తపల్లి హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంటూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సురక్షితమైన నీటిని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్య నివారణకు ప్రతీ ఒక్కరూ విరివిరిగా మొక్కలు నాటాలని గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు అన్నారు. బుధవారం గుడిపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ నాగార్జున, కానిస్టేబుల్ కృష్ణ, హోంగార్డులు లింగయ్య, లాలు, రమణారెడ్డి, దశరథ, మధు, బీమా, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో మొక్క నాటుతున్న ఎస్ఐ, సిబ్బంది

చేనేతలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలి



నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత సంఘం నాయకులు

నల్లగొండ, నార్కట్‌పల్లి, దేవరకొండ, గట్టుప్పల్, ఆగస్టు 7: చేనేత కార్మికులను, చేనేత వృత్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలని పలువురు చేనేత సంఘం నాయకులు కోరారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లాలోని పలు మండలాల్లో చేనేత కార్మికులు జాతీయ చేనేత పతాకాన్ని ఆవిష్కరించారు. పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ చేనేత పరిశ్రమను నిలబెట్టడంతో పాటు ఆయా పరిశ్రమల ఉత్పత్తులకు మార్కెటింగ్ ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత కార్మికులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని అన్నారు. కష్టకాలంలో ఉన్న కనుమరుగవుతున్న చేనేత రంగాన్ని కాపాడాలని కోరారు. గత ప్రభుత్వంలో కార్మికులకు లబ్ధి జరిగిన పథకాలను కొనసాగించాలని తెలిపారు. త్రిఫ్ట్ నిధులను వెంటనే విడుదల చేయాలని, చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, చేనేత మిత్ర కింద 40 శాతం యారన్ సబ్సిడీ స్కీంను పునరుద్ధరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. చేనేత కార్మికులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

● నల్లగొండ పట్టణంలోని 35వ వార్డులో గుర్రం ధనలక్ష్మి పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో కాశమ్మ, పలువురు పద్మానగర్ కాలనీకి చెందిన చేనేత కార్మికులు పాల్గొన్నారు

● నార్కట్‌పల్లి మండలంలోని బీవెల్లెంల, అమ్మనబోలు గ్రామాల్లో చేనేత కార్మికులు జాతీయ చేనేత పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో తెలంగాణ చేనేత ఐక్య వేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పోచం వెంకటేశ్వర్లు, బీవెల్లెంల పద్మశాలీ చేనేత సంఘం అధ్యక్షుడు చెరుపల్లి పరమేశం మాట్లాడుతూ చేనేత కార్మికుల ఐక్యత చాటడానికి చేనేత ఆవశ్యకతను తెలియజేయడానికి చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు రాపోలు గాయత్రి, రాపోలు సంతోష్, బద్దం వరమ్మరాంరెడ్డి, రాపోలు వెంకటేశం, చెరుపల్లి రఘుపతి, మిర్యాల నర్సింహ, ఈవూరి నర్సింహ, నాగార్జున, జెల్ల రమేష్ రాములు, విజయ్, సైదులు పాల్గొన్నారు.

● దేవరకొండలో లయన్స్ క్లబ్ సహస్ర ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో క్లబ్ అధ్యక్షురాలు శివపార్వతి, హెచ్‌పీ గ్యాస్ చైర్మన్ పున్న శైలజ మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వనం యాదమ్మ, జయలక్ష్మి, చేనేత సహకార సంఘం నాయకులు శిరందాసు కృష్ణయ్య, పున్న వెంకటేశ్వర్లు, పున్న గోవర్ధన్, చంద్రమౌళి, బాలరాజు, సుదర్శన్ పాల్గొన్నారు.

● గట్టుప్పల్ మండలకేంద్రంలో పద్మశాలీ యువజన సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు పున్న కిషోర్, నామని బుచ్చయ్య, తిరందాసు రాములు, చేరుపల్లి కృష్ణ, ఇడం వెంకటేశం, కర్నాటి లింగయ్య, ధనంజయ్య, ఆంజనేయులు, అంజయ్య, శ్రీనివాస్, జెల్ల మారయ్య, మారుకొండయ్య, మురళి పాల్గొన్నారు.



అమ్మనబోలులో గాంధీ విగ్రహానికి దారపుఉండల మాల వేసిన చేనేతలు

ఎస్సీ డిక్లరేషన్‌ను అమలుచేయాలి



చిట్యాల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎస్సీమోర్చా నాయకులు

మిర్యాలగూడ రూరల్, మిర్యాలగూడ టౌన్, చిట్యాల, మునుగోడు, రామగిరి, ఆగస్టు 7: కాంగ్రెస్ చేవెళ్ల బహిరంగ సభలో ప్రకటించిన విధంగా ఎస్సీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ దళిత మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించిన ధర్నాలో పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే ఎస్సీ కుటుంబాలకు అంబేడ్కర్ అభయహస్తం పథకం కింద రూ.12 లక్షల ఆర్థికసాయం అందజేయాలని అన్నారు. ఇళ్లు లేని పేద ఎస్సీలకు ఇళ్ల స్థలాలు, ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

● మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఆడ్ల రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మంద శివమాదిగ, పాతకోటి సైదులు, అవిరెండ్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలోని నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎడ్ల రమేష్‌కుమార్ మాట్లాడారు. సమావేశంలో నాయకులు మంద శివ, అవిరెండ్ల ప్రభాకర్, పాతకోటి సైదులు, గిరి తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాలలో బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ ప్రతీ ఎస్సీ కుటుంబానికి రూ. 12లక్షల ఆర్థికసాయం చేయాలని, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 18శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నకిరేకలంటి మొగులయ్య, మాస శ్రీనివాస్, పెరిక మునికుమార్, శ్యామ్, వీరయ్య, లింగస్వామి, శ్రీను పాల్గొన్నారు.

● మునుగోడులో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బొడిగె అశోక్‌గౌడ్, మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్యయాదవ్, దళితమోర్చా మండల కమిటీ అధ్యక్షుడు పందుల యాదయ్య, నాయకులు బొడ్డు నాగరాజుగౌడ్, కమ్మంపాటి నర్సింహ, అక్కెనపల్లి సతీష్, శంకర్, నగేష్, రమేష్, బ్రహ్మచారి, క్రాంతికుమార్, విష్ణు, నాగేందర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

● కనగల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల్‌రావు, నాయకులు పులకరం బిక్షం, దేవేందర్, సైదులుగౌడ్, వెంకన్న, సైదులుగౌడ్, దుర్గ పాల్గొన్నారు.

● నల్లగొండలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి మొగులయ్య, జిల్లా అధ్యక్షుడు పెరిక మునికుమార్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు లింగస్వామి, నర్సింహ పాల్గొన్నారు.

డిండి'కి ఎత్తిపోతలకు నిధులు కేటాయించాలి



దేవరకొండలో కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

దేవరకొండ, మునుగోడు, ఆగస్టు 7: డిండి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించి డీపీఆర్‌ను ఆమోదించి పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లా వెంకటయ్య, బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. బుధవారం దేవరకొండ, మునుగోడులో డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన నల్లగొండలో నిర్వహించనున్న సదస్సు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కరపత్రాలు, పోస్టర్లు విడుదల చేసి జీపుజాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిండి ఎత్తిపోతలకు శంకుస్థాపన చేసి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు నీరు ఎక్కడి నుంచి ఇస్తారో స్పష్టతలేదన్నారు. డిండి ఎత్తిపోతలకు నిధుల కేటాయింపులో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం డీపీఆర్‌ను ఆమోదించి పర్యావరణ అనుమతులు తీసుకొని నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు బిజిలి లింగయ్య, పర్వత్‌రెడ్డి, బుడిద వెంకటేష్, శంకరయ్య, నాగయ్య, మహేందర్, రామాంజనేయులు, మునుగోడులో రైతు సంఘం నాయకులు సాగర్ల మల్లేష్, వరకుప్పల ముత్యాలు, ధనుంజయగౌడ్, యాసరాణి శ్రీ ను, వేముల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: డిండి ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి అర్రూరి శ్రీను, నాయకులు కత్తుల లింగస్వామి డిమాండ్ చేశారు. మండలంలోని పిట్టంపల్లి, బొంగోనిచెర్వు, పేరేపల్లి గ్రామాల్లో సదస్సు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మెట్టు నర్సింహ, అంతటి యాదయ్య, అంతటి నర్సింహ, నల్ల బుచ్చిరెడ్డి, సామ సత్తిరెడ్డి, ఎర్ర మురళీధర్, రాజు, ప్రకాష్, ఇస్తారి, మైల యాదయ్య, గోపాల్‌రెడ్డి, చంద్రయ్య, శంకరయ్య, లక్ష్మయ్య, నర్సింహపాల్గొన్నారు.

నేడు క్యాంపు కార్యాలయంలో బాలునాయక్ గృహప్రవేశం

దేవరకొండ, ఆగస్టు 7: దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ఈ నెల 8వ తేదీన ముదిగొండ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గృహప్రవేశం చేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్యాంపు కార్యాలయానికి మరమ్మతులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో 8న ఎమ్మెల్యే బాలునాయక్ క్యాంపు కార్యాలయంలో గృహ ప్రవేశం చేసి కార్యకలాపాలు కొనసాగించనున్నారు. అక్కడి నుంచి ప్రభుత్వ పథకాలు, సమావేశాలు, కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు.

సామాజిక చైతన్య దీక్ష విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న కోతి ఇందిరాకృపాకర్

శాలిగౌరారం, ఆగస్టు 7: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పలు సామాజిక సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఈ నెల 8,9 తేదీల్లో నిర్వహించే సామాజిక చైతన్య దీక్షలను విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ సభ్యురాలు కోతి ఇందిరా కృపాకర్ కోరారు. మండల కేంద్రంలో దీక్ష పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమని, దళిత విభజన ప్రయత్నాలు మానుకోవాలని అన్నారు. న్యాయస్థానాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్ల చట్టం చేయాలన్నారు. ఇంకా 16 డిమాండ్ల పరిష్కారానికి ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు మక్క బుచ్చరాములు, వల్లముల్ల పెద్ద సైదులు, పట్టేటి రాములు, పట్టేటి కృష్ణకాంత్, కోతి కృపాకర్, సంపత్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

వేములపల్లి, కనగల్, నార్కట్‌పల్లి, మునుగోడు, గుర్రంపోడు, ఆగస్టు 7: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలని మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, షీ టీం ఎస్ఐ కోటేష్, పలువురు ఎస్ఐలు అన్నారు. మిషన్ పరివర్తన్‌లో భాగంగా బుధవారం నార్కట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశలో బాలికలపై అసభ్యంగా ప్రవరిస్తూ ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చట్టపరంగా కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు. మేజర్లు కాకుండా వివాహాలు చేసుకోరాదని, అలా చేసుకుంటే చట్టపరంగా నేరమని విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

● మిర్యాలగూడ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, షీ టీం ఎస్ఐ కోటేష్ మాట్లాడారు. మేజర్లు కాకుండా వివాహాలు చేసుకోరాదని, అలా చేసుకుంటే చట్టపరంగా నేరమని విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కనగల్ కనగల్ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ విష్ణు మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి పూర్తిగా నిర్మూలించాలని అన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ మమత, ఉపాధ్యాయులు వీసీలు దస్తగిరి, రవీందర్‌రెడ్డి, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ క్రాంతికుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడి మీ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

● మునుగోడు గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడారు. లక్ష్య సాధన కోసం విద్యార్థినులు కష్టపడి చదువుకోవాలని సూచించారు. ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అంజయ్య, ప్రజాపతి, ప్రిన్సిపాల్ సంధ్యారాణి, విద్యార్థినులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

● గుర్రంపోడు మండలంలోని కొప్పోలు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ శివప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యాదగిరి, శ్రీకాంత్, తూటిపల్లి రామకృష్ణ, భైరగోని గణేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం జోలికి వస్తే సహించం

● *బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి*



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి కిషన్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 7: బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని కూల్చి వేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పదేపదే అనడం ఇక ఆపాలని పార్టీ కార్యాలయం జోలికి వస్తే సహించేది లేదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయంతో పాటు అసెంబ్లీలో చర్చించి నిబంధనల మేరకు కేటాయించిన తర్వాతే పార్టీ కార్యాలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. పార్టీ ఆఫీస్ కోసం ప్రభుత్వ భూమిని కబ్జా చేయలేదనే విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గ్రహించాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి కార్యాలయం లేకపోతే ప్రభుత్వం నుంచి భూమిని కేటాయించుకొని నిర్మించుకోవాలే తప్ప ఇతర పార్టీల కార్యాలయాలను కూల్చి వేస్తాననడం సమంజసం కాదన్నారు. 30 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పార్టీ ఆఫీస్ నిర్మించుకోలేదని, కార్యకర్తలంతా ఆయన ఇంటి చుట్టూ తిరగడం కోసమే పార్టీ ఆఫీసును నిర్మించలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మెప్పు పొందేందుకే తరచూ బీఆర్‌ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు. ఆరు గ్యారెంటీల హామీలో బస్సులో ఉచిత ప్రయాణం తప్ప ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని అన్నారు. సీజన్ మొదలైనా రైతు భరోసా ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు దోటి శ్రీనివాస్, ఎస్‌కె.లతీఫ్, పోల వెంకటాద్రి, కర్నాటి మల్లేష్ పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

చిట్యాల, ఆగస్టు 7: చిట్యాల పట్టణంలోని కనకదుర్గ ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఆలయంలోని నాలుగు హుండీలు లెక్కించగా 61,442 రూపాయాల నగదు వచ్చినట్లు ఆలయ చైర్మన్ అంబటి నాగిరెడ్డి తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీరేశంను కలిసి ఈ నెల 16వ తేదీన ఆలయంలో నిర్వహించే సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూరెల్ల లింగస్వామి, ఆలయ కమిటీ చైర్మన్ మారగోని అంజనేయులు, సభ్యులు బుద్ధ విమల, గంజి వెంకటేశం, నర్సిరెడ్డి, లింగస్వామి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

10న బీసీల సత్యగ్రహ దీక్ష

నల్లగొండ, ఆగస్టు 7: హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఈనెల 10వ తేదీన జరిగే బీసీల సత్యగ్రహ దీక్షను విజయవంతం చేయాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ కోరారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు కులగణన చేయకుండా స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు అమలుచేయకుండా పన్నుతున్న కుట్రలను ఛేదించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు దుడుకు లక్ష్మీనారాయణ, లొడంగి గోవర్ధన్, లింగంగౌడ్, రమేష్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

మర్రిగూడ: గ్రామపంచాయతీ సిబ్బంది పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో మున్నయ్యకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తుందని ఆరోపించారు. పంచాయతీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనం చెలించాలన్నారు.

నార్కట్‌పల్లి: పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి లయన్స్ క్లబ్ ఎల్లపుడూ తోడుగా ఉంటుందని రీజియన్ చైర్మన్ ఆమంచి రాజలింగం, లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ గ్రేటర్ అధ్యక్షుడు గోదల కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ఏపీ లింగోటంలో గల జడ్పీ ఉన్నత, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నర్సింహారెడ్డి సౌజన్యంతో స్కూల్ బ్యాగులు, నోటు బుక్స్, పెన్నులను అందజేశారు.

శాలిగౌరారం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ పంపిణీ చేశారు.

శాలిగౌరారం: శాలిగౌరారంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో అండాళ్‌దేవి అమ్మవారికి తిరునక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు ప్రత్యేక పూజలు చేశారు.

డిండి: మండలంలోని తవక్లాపూర్ నుంచి నగరదుబ్బతండా వరకు బీటీ రోడ్డు నిర్మించాలని సీపీఐ నాయకులు ఎమ్మెల్యే బాలునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. మట్టిరోడ్డు కావడంతో గుంతలు ఏర్పడి వర్షాలు కురిసినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు.

చింతపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని మాజీ ఎంపీపీ కొండూరు భవానీపవన్‌కుమార్ అన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో పార్టీలకతీతంగా పాల్గొని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సహకరించాలన్నారు.

చిట్యాల: భారీ వరదలతో నష్టపోయిన వయానాడ్ బాధితులను ఆదుకోవాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ కోరారు. చిట్యాలలో ఐద్వా ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. ఆపద సమయంలో మానవత్వాన్ని చాటాలని కోరారు.

మర్రిగూడ: మర్రిగూడ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలో రెండు మహిళా కుక్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పాఠశాల స్పెషల్ అధికారి జ్యోతి తెలిపారు. ఖాళీగా ఉన్న ఈ పోస్టులకు 7వ తరగతి చదివి ఉండాలని సూచించారు. అర్హత కలిగిన వారు ఈ నెల 10వ తేదీలోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చిట్యాల: పట్టణంలోని గ్రీన్‌గ్రోవ్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న బి.గౌతమ్ తల్లి నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడింది. ఆమె చికిత్సకు చాలా పెద్దమొత్తంలో ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో విషయం తెలుసుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాలలో ఇతర విద్యార్థుల నుంచి రూ.44500 సేకరించి అందజేశారు.

కనగల్: మండల కేంద్రమైన కనగల్‌లో ఆర్టీసీ కార్గో లాజిస్టిక్ కౌంటర్ సేవలను ఆ సంస్థ అధికారులు కె.శ్యాంకుమార్, హరిలాల్ ప్రారంభించారు. ఎంతో ఉపయుక్తమైన ఆర్టీసీ కార్గో (కొరియర్) సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మునుగోడు: మండల కేంద్రంలోని మిర్యాల నాగరాజు తన తండ్రి వెంకటేశం అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతని క్లాస్‌మేట్స్ తమవంతుగా రూ.28వేలు అందజేశారు.

నార్కట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్‌రావు నార్కట్‌పల్లిలో జరిగిన ఓ శుభ కార్యక్రమానికి హాజరయ్యారు. నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన తన మిత్రుడు దోసపాటి రఘు కుమార్తె నందినికి భానుప్రకాశ్‌తో జరిగే వివాహ లగ్న నిశ్చయతాంబూలం కార్యక్రమానికి ఆయన హాజరై కాబోయే దంపతులను ఆశీర్వదించారు.

చిట్యాలరూరల్: హానికారక కాలుష్యాన్ని విడుదల చేసే రసాయన పరిశ్రమలను తొలగించాలని చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన అఖిలపక్ష నాయకులు, గ్రామస్థులు మైన్స్ జియాలజీ శాఖ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌కు వినతి పత్రం అందజేశారు. రసాయన కాలుష్యం వల్ల పలువురు గ్రామస్తులు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మాడ్గులపల్లి: తల్లిపాలతో బిడ్డ ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మి, నాగమణి అన్నారు. పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించినట్లయితే బిడ్డలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పిల్లలకు శారీరక, మానసిక ఎదుగుదల పెంపొందుతుందన్నారు.

ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలి

మిర్యాలగూడ, ఆగస్టు 7: రైతులకు ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేసి ఎరువుల నిల్వలను పరిశీలించి మాట్లాడారు. ఎరువుల దుకాణాల డీలర్లు రైతులకు ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏవో గుర్రం సరిత తదితరులు పాల్గొన్నారు.

జీవో 33ను తక్షణమే రద్దు చేయాలి

నల్లగొండ, ఆగస్టు 7: విద్యార్థుల స్థానికతకు అడ్డుగా ఉన్న జీవో 33ను తక్షణమే రద్దు చేయాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2017లో గత ప్రభుత్వం 144జీవో అమలు చేసి విద్యార్థుల స్థానికతకు ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు రాష్ట్రంలో ఎక్కడ చదివినా స్థానికులుగా గుర్తించి ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ సీట్లు పొందేవారన్నారు. 144జీవో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు చల్లా కోటేష్, శంకర్, లింగయ్య, పరమేష్, మహేష్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.